సాక్షి సిద్దిపేట

ఆదివారం । 26 । నవంబర్ । 2023



బీజేపీ, కాంగ్రెస్‌లవి ఝూటా..

ఝూటా మాటలతో మోసం చేయడానికి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరును ఎండగట్టాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. వివరాలు 6లో ▸



దుబ్బాకను డివిజన్‌గా..

బీజేపీ కార్యకర్తలే నా బలం.. బలగం అని ఆ పార్టీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారంలో అన్నారు. వివరాలు 6లో ▸



నీటి గోస తీర్చాం..

తెలంగాణ వచ్చిన తర్వాత మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగు నీరు అందుతుందని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయండి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లు కనిపిస్తే వెంటనే సీ- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శనివారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యం, మరే ఇతర ప్రలోభాలు ఓటర్లను ప్రభావితం చేయకుండా ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న కృషిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, నగదు పంపిణీ, ప్రజల ఆస్తులను పాడు చేయడం, ప్రలోభ పెట్టే వస్తువుల పంపిణీ, ఓటర్లను బెదిరించడం తదితర ఎన్నికల నిబంధన ఉల్లంఘనలను రికార్డు చేసి యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే 100 నిమిషాల్లో ఎన్నికల అధికారులు స్పందించి యాక్షన్ తీసుకుంటారని సూచించారు.

ఓట్లప్పుడే పీవీ పేరు గుర్తుకొచ్చిందా?

మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు



మాట్లాడుతున్న లక్ష్మీకాంతరావు

హుస్నాబాద్‌రూరల్: దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరును ఉచ్చరించే అర్హత కాంగ్రెస్ పార్టీకి, ప్రియాంక గాంధీకి లేదని, ఓట్ల కోసం పీవీ పేరు పుట్టిన నేలను ప్రస్తావించి ప్రసంగించడం శోచనీయం అని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు విమర్శించారు. హుస్నాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కెప్టెన్ మాట్లాడారు. పీవీ పేరుతో ప్రియాంక గాంధీ ఓట్లు అడగడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తెచ్చి పేదలను ఆదుకున్నాడని, రాష్ట్రం అభివృద్ధి చేసి దేశంలో ఆదర్శంగా నిలుపుతున్నారని కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఒడితల సతీష్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ మారంపల్లి సుధీర్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ లింగాల సాయన్న, సాంబారి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పేదల ప్రభుత్వం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): బీఆర్ఎస్ పేదల ప్రభుత్వమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శనివారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్‌తో కలిసి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యంకాని హామీలనిస్తూ కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లో చేస్తున్న ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నో మంచి పథకాలను ప్రవేశ పెడుతున్న సీఎం కేసీఆర్‌ను ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్కంపల్లి నరేందర్, కాచం నవీన్, మల్లం ఐలయ్య, భూములుగౌడ్, పాండుగుప్త, వెంకట్‌రెడ్డి, సంపత్, నాగరాజు,నర్సింలుగౌడ్ పాల్గొన్నారు.

5 కిలోల గడ్డలను తొలగింపు

దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన చికిత్స



దుబ్బాక: దుబ్బాకలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో శనివారం వైద్యులు అరుదైన చికిత్స చేసి మహిళ కడుపులో నుంచి సుమారు 5 కిలోల గడ్డలను తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. మిరుదొడ్డి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన బండి మంజుల (54) రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతుంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో మూడు రోజుల క్రితం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షలు నిర్వహించిన ఆమె కడుపులో సర్వాయికల్ ఫైబ్రాయిడ్ గడ్డలు ఉన్నాయని గుర్తించారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్ , సర్జన్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో చికిత్స చేసి సుమారు 5 కిలోలు ఉన్న 2 గడ్డలను తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.



హరీశ్ రావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి శ్రీనిత



దుబ్బాకలో రోడ్ షోలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి సతీమణి మంజులతారెడ్డి

బరిలోకి బలగం

- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల కుటుంబీకులు
- ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థన
- మహిళలతో మమేకమవుతున్న సతీమణులు
- యువతను కలుపుకుపోతున్న కుమారులు, కూతుళ్లు
- గెలుపే లక్ష్యంగా ముందుకు

సాక్షి, సిద్దిపేట: ఎన్నికల తేదీ సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో అభ్యర్థులు, నాయకులు కాకుండా వారి కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకులు పాలుపంచుకుంటున్నారు. నియోజకవర్గంలో తమ కుటుంబ సభ్యుల గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. గ్రామాల్లోని కాలనీలు, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరిస్తూ తమ వారికి ఓటు వేయాలని ప్రచారం హోరెత్తిస్తున్నారు. అన్ని చోట్లకు అభ్యర్థి తిరిగేందుకు సమయం తక్కువగా ఉండడంతో కొన్ని చోట్లకు ప్రచార బాధ్యతలను కుటుంబ సభ్యులు తీసుకుంటున్నారు. మహిళలతో మమేకం అవుతున్న సతీమణులు, యువతతో కుమారులు, కూతుళ్లు కలిసిపోయి ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

పతుల కోసం సతులు

పతుల కోసం సతులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీల మేనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఓటర్లకు వివరిస్తున్నారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తన్నీరు హరీశ్ రావుకు మద్దతుగా ఆయన సతీమణి శ్రీనిత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తన భర్తకు అందరూ ఓటు వేసి భారీ మోజార్టీ ఇవ్వాలని కోరుతున్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై ఇటీవల దుండగుడు కత్తితో దాడి చేయడంతో వైద్యులు విశ్రాంతి అవసరం అని సూచించారు. దీంతో ప్రభాకర్ రెడ్డి సతీమణి మంజులతారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, రోడ్ షోలలో అనర్గలంగా మాట్లాడుతున్నారు. భర్తపై జరిగిన దాడి, ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపు కోసం సతీమణి నీలిమా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తరపున అరుణ ప్రచారం చేస్తున్నారు.



తండ్రిప్రతాప్ రెడ్డికి మద్దతుగా ప్రచారంలో బోనమెత్తిన కూతురు ప్రియాంక

కుమారులు, కూతుళ్లు సైతం

బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా కుమారుడు పృథ్వీరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి కుమారుడు అనురాగ్ రెడ్డి, సోదరుడు రవీందర్ రెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు. ప్రతాప్‌రెడ్డి గెలుపు కోసం కుమారులు ప్రశాంత్ రెడ్డి, రాకేష్ రెడ్డి, కూతురు ప్రియాంక, కోడళ్లు సైతం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి మద్దతుగా కూతురు ఆంక్షారెడ్డి ప్రచారం చేపట్టారు.

ఐదు గంటల కరెంట్ సరిపోతుందా?

- సాగు ఎట్లా అయితదో కాంగ్రెస్ నాయకులే చెప్పాలి
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించండి
- సిద్దిపేట, గజ్వేల్ మాదిరి జనగామ అభివృద్ధి చేస్తాం
- మద్దూరు రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ హయాంలో రాత్రి విద్యుత్‌తో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో జనగామ బీఆర్ఎస్ పల్లా రాజేశ్వర్ రెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించగా, మంత్రి హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంపై కాంగ్రెస్ నేతలకు కనీస అవగాహన లేదని, ఐదు గంటల విద్యుత్‌తో పంటలు ఏ విధంగా సాగు అవుతాయో చెప్పాలని డిమాండ్ చేశారు. జనగామ నియోజకవర్గంలోని ప్రతీ పల్లె అభివృద్ధి చెందాలంటే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తేనే సాధ్యం అవుతుందని అన్నారు. నాడు ఆంధ్ర పరిపాలనలో మద్దూరు మండలం ఏ విధంగా ఉందో, నేడు ఏ విధంగా అభివృద్ధి చెందిందో గమనించాలన్నారు. ప్రతీ గ్రామంలోని చెరువులు, కుంటలు గోదావరి జలాలతో నింపి పాడి పంటలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. మహిళల కోసం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్ ఇస్తున్నామని, అధికారంలోకి వచ్చాక గ్యాస్ సిలిండర్ ధర రూ.400కే అందిస్తామన్నారు. ఇప్పటికే రూ.14వేల కోట్లు రుణమాఫీ చేశామని, తిరిగి అధికారంలోకి రాగానే మిగిలిన రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అబద్ధాల ప్రచారం..

కాంగ్రెస్ వంద అబద్ధాలతో అధికారంలోకి రావాలని చూస్తుందని, కర్ణాటక రాష్ట్రంలో ఇదే విధంగా అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు కేవలం ప్రచారానికే వస్తారని, ఎన్నికలయ్యాక మళ్లీ కనిపించరని ఎద్దేవా చేశారు. సిద్దిపేట, గజ్వేల్ అభివృద్ధి మాదిరిగా జనగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు, అందుకు పల్లాకు అండగా నేను ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

పెద్దపాలేరు లాగా పని చేస్తా: పల్లా

జనగామ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా ప్రతీ గ్రామాన్ని, వార్డులను తిరిగానన్నారు. అసత్య ప్రచారాలు చేస్తూ, పార్టీలు మారిన కొమ్మూరి కి ఓట్ల ద్వారానే బుద్ధి చెప్పాలన్నారు. ఐదు రోజులు తన కోసం కష్టపడితే, ఐదేళ్లు పెద్ద పాలేరు లాగా అందరికి అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంత్రి దయాకర్‌రావు, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మండల శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, పార్టీ మండలాల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు దుబ్బాకలో ప్రజా ఆశీర్వాద సభ

- హాజరుకానున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- భారీగా ఏర్పాట్లు
- 60 వేలమంది తరలింపునకు సన్నాహాలు
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరుగనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు నియోజక వర్గం నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాకలో పుట్టి, పెరిగి విద్యాబుద్ధులు నేర్చిన సీఎం కేసీఆర్ నేడు దుబ్బాకకు వస్తున్న సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలుకాలన్నారు. అన్ని గ్రామాల నుంచి 60 వేలకు పైగా ప్రజలు తరలివస్తారన్నారు. సభకు వచ్చేవారి కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

పటిష్ట బందోబస్తు: సీపీ శ్వేత

దుబ్బాక పట్టణంలో ఆదివారం జరుగనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగసభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ శ్వేత తెలిపారు. శనివారం పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో ఉన్నసభా స్థలం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బందోబస్తు చర్యలపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సభ కోసం అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో మొత్తం ఆరు సెక్టార్‌లుగా పటిష్టమైన బందోబస్తు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, రాంచందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేశ్, చంద్రశేఖర్, రవీందర్ రాజు, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్ఐలు గంగరాజు,రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కారుకు వేసినట్లే

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- పటాన్‌చెరులో సకల జనుల విజయసంకల్ప సభ



అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న నందీశ్వర్ గౌడ్, తదితరులు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినట్లు అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. శనివారం సాయంత్రం పటాన్‌చెరు మార్కెట్ యార్డ్‌లో బీజేపీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరై మాట్లాడారు. సభకు హెలికాప్టర్ ద్వారా పటాన్‌చెరు ఇక్రిసాట్ చేరుకొని, అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సభ స్థలికి చేరుకున్నారు. అమిత్ షా ప్రసంగాన్ని ముందు హిందీలో ప్రారంభించారు. కొన్ని క్షణాల తర్వాత క్షమాపణలు కోరుతూ తన ప్రసంగాన్ని అనువదించాలని కోరారు. దీంతో పార్టీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్ ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. కేవలం 18 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. అయితే ప్రజలను ఉత్సాహపరుస్తూ ప్రసంగాన్ని కొనసాగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు బీఆర్ఎస్ లోకి వెళ్లారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. దేశంలో రెండున్నర కోట్ల ఉద్యోగాలు ఇస్తే ఒక్క పేపర్ కూడా లీక్ కాలేదని, తెలంగాణలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల నోట్లో కేసీఆర్ మట్టి కొట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. పటాన్‌చెరు ప్రజలు రెండు సార్లు ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కటి నందీశ్వర్ గౌడ్‌కు వేసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, మరో ఓటుతో రానున్న ఎంపీ ఎన్నికల్లో నరేంద్ర మోదీకి వేయాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి ప్రభు చవాన్, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, గోదావరి అంజిరెడ్డి, రవీందర్, అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఆశిష్ గౌడ్, నరేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం



మాట్లాడుతున్న రఘురాం

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టీ.రఘురాం అన్నారు. శనివారం జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం, అదనపు న్యాయమూర్తి మురళీ మోహన్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి న్యాయం అందించాలని, ఎవరూ కూడా న్యాయం లభించక అన్యాయమైపోవద్దనే లక్ష్యంతో లీగల్ సర్వీసెస్ అథారిటీ పని చేస్తుందన్నారు. రాజ్యాంగంలో ఎక్కువ, తక్కువ, కులం, మతం, లింగ బేధం లేకుండా అందరికీ సమన్యాయం, సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లి, చందన, శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శివాజీ, వై.రాజేశ్వర్‌రెడ్డి, మంతూరి సత్యానారాయణ, పత్రి ప్రకాశ్, కోర్టు సిబ్బంది సుధీర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లది కపట ప్రేమ

ఏఐసీసీ ఓబీసీ సెల్ కార్యదర్శి వినయ్ కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని ఏఐసీసీ ఓబీసీ సెల్ కార్యదర్శి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వినయ్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీసీలే ముఖ్యమంత్రులుగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో కులగణన చేయాలని కేంద్రాన్ని అడుగగా, నేటి వరకు చేయలేదన్నారు. బీజేపీ బీసీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను తొలగించి, కిషన్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారన్నారు.ఎన్నడూ లేనిది బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తాం అని ప్రకటించడం హాస్యాపదమన్నారు. తామ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట అభ్యర్థి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు హరీశ్ కుమార్, లావణ్య, అబ్దుల్ ఆనస్, అత్తు ఇమామ్, కలీముద్దీన్, నర్సింహారెడ్డి , గోపికృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ గెలుపు ఖాయం



బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లోని పలు పార్టీలకు చెందిన 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

నాచగిరిలో కార్తీక శోభ



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): కార్తీక వ్రతసిరితో నాచగిరి అలరారింది. శివ కేశవుల నెలవు శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. కార్తీక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించుకునేందుకు, నిజాభిషేకం, గరుడసేవ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తరలివచ్చారు. హరిద్రానదిలో పుణ్యస్నానాలాచరించిన అనంతరం దంపతులు వ్రతమండపంలో సత్యనారాయణ వ్రతమాచరించారు. గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. క్షేత్రంలో 90 వ్రతాలు, 25 గరుడసేవలు, 8 నిజాభిషేకాలు జరిగినట్లు ఈఓ తెలిపారు.

ప్రేమ విఫలమైందని బాలిక ఆత్మహత్య

ప్రియుడి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రేమ విఫలమైందని ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు మృతదేహంతో ప్రియుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన ఇటిక్యాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు(21), బాలిక (17) మధ్య కొంతకాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతుంది. ఈ క్రమంలో యువతి తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని అడుగగా, అతడి కుటుంబ సభ్యులు నిరాకరించారు. ప్రేమ విఫలమైందని ఆవేదనతో బాలిక 20 రోజుల క్రితం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారి కిడ్నీలు, లీవర్ పాడైపోయాయి. వైద్యులు డయాలసిస్ చేసి ఇంటికి పంపించారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా ఎన్నికల తర్వాత చూద్దామని చెప్పారు. ఇంతలోనే బాలిక పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబీకులు మృతదేహంతో ప్రియుడి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇరు వర్గాల పెద్దలు వారివారి కుటుంబీకులను సముదాయించి నచ్చజెప్పడంతో విరమించారు. అనంతరం అంత్యక్రియలు చేపట్టారు. ఈ విషయంపై ఎస్ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తూప్రాన్‌కు ప్రధాని మోదీ రాక



తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్, కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓటమి ఖాయమైందన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, యాదగిరి తాటి విఠల్, కప్పెర ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెదక్: ఎన్నికల ప్రచారంలో జిల్లాలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీని ముఖ్యమంత్రిని చేయాలనే ఏకైక పార్టీ బీజేపీనే అని, తమ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ కులానికి చెందిన వ్యక్తి సీఎం అవుతారని పేర్కొన్నారు. అనంతరం మెదక్ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నందారెడ్డి, ప్రసాద్, విజయ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

గజ్వేల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ కారణంగా వాహనాలను దారి మళ్లించామని, ప్రజలు గమనించాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి శనివారం తెలిపారు. తూప్రాన్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్ళే వాహనదారులు వెల్దుర్తి మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. అలాగే సభాస్థలికి వచ్చే కార్యకర్తలు, అభిమానులు అగ్ని ప్రమాదానికి దారితీసే ఏ వస్తువులు అలాగే వాటర్ పాకెట్లు, బాటిల్స్, బ్యాగులు సభకు తీసుకొని రావద్దని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఎన్‌సీసీ కాడెట్లు బాధ్యతగా మెలగాలి

గజ్వేల్ ఏసీపీ రమేష్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీ కాడెట్లు సమాజంలో బాధ్యతాయుతంగా ఉంటూ ప్రజలకు సేవ లందించాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్‌సీసీ యూనిఫాం అనేది గౌరవప్రదమైనదని, సమాజంలో ప్రజలకు సేవలందించేందుకు ఈ యూనిఫాం బాధ్యతను పెంచుతుందన్నారు. విద్యార్థులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాణి ఈ సంవత్సరం ఎన్‌సీసీ విభాగంలో రాష్ట్ర, జాతీయ శిబిరాలైన ఆర్మీ అటాచ్‌మెంట్, స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్, ఇంటర్ బెటాలియన్, మౌంటెనీరింగ్ శిబిరాలకు హాజరైన కాడెట్ల వివరాలను, ఎన్‌సీసీ–బీ,సీ సర్టిఫికెట్ పరీక్షల ఫలితాలను వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు బాల్‌రాజు, విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రం, డాక్టర్ పెద్దిరాజు పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకం



తైలాభిషేక పూజలో భక్తులు

వర్గల్(గజ్వేల్): శని త్రయోదశి పర్వదిన వేడుకలతో వర్గల్ శ్రీవిద్యాసరస్వతి శనీశ్వర క్షేత్రం అలరారింది. శనివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు త్రయోదశి పర్వదిన వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 6 గంటల నుంచి భక్తుల సామూహిక తైలాభిషేక పూజలు కొనసాగాయి. ప్రధాన మండపంలో అర్చకులు వారితో శాస్త్రోక్తంగా శనీశ్వర పూజ జరిపించారు. అనంతరం శనీశ్వరుని మూలవిరాట్టుకు తిల తైలం సమర్పించారు. 710 తైలాభిషేకాలు జరిగినట్లు ఆలయవర్గాలు తెలిపారు.

బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెడుతుందని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి వారిపై భారం మోపుతుందన్నారు. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై మతపరమైన ఆంక్షలు విధిస్తూ దాడులను చేస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య, నాయకులు రవి, రంగారెడ్డి, అహ్మద్, బండ్ల స్వామి, వేణుగోపాల్, బాలకృష్ణారెడ్డి, బాల్‌లక్ష్మి, వెంకటాచారి, కనకచారి, మహాలక్ష్మి, కనకవ్వ, స్వామి, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

- అభివృద్ధి కావాలా.. కబ్జాకోరులు కావాలా
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

నర్మెట: మూడెకరాల భూమి, దళితబంధు, రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్లు, పంటనష్టం, ఇంటికో ఉద్యోగం, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తానని గద్దెనెక్కి మాటతప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలకేంద్రంతోపాటు కన్నెబోయినగూడెం, వెల్దండ, అమ్మాపురం, ఆగాపేట, రత్నతండా, ఇసుకబాయితండా, ఇప్పలగడ్డ, గుంటూర్‌పల్లి, మల్కపేట, హన్మతాపూర్‌లలో పార్టీ శ్రేణులతో కలసి శనివారం ప్రచారం నిర్వహించిన ఆయన బీఆర్‌ఎస్ పాలనపై ధ్వజమెత్తారు. కోళ్లను తినేవాడుపోయి.. గొర్లను తినేవాడోస్తున్నాడు. అభివృద్ధి కావాలా.. కబ్జాలు చేసేవాడు కావాలా, అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని అన్నారు. జనగామ అభివృద్ధిని తుంగలో తొక్కి భూకబ్జాలకు పాల్పడిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పెద్ద కబ్జాకోర్.. ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దంటూ జనగామ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే కదా, ఎనిమిదేళ్లుగా ఎమ్మెల్సీగా ఉన్న పల్లా జనగామకు ఏం అభివృద్ధి చేశాడు.. అలాంటి వ్యక్తికి ఓటు వేస్తారా అంటూ ఓటర్లను ప్రశ్నించారు. గతంలో జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా మచ్చలేని సేవలందించి అభివృద్ధి చేసిన తనను ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గంగం నర్సింహారెడ్డి, భూక్య జయరాం, సర్పంచ్ కుంటి జగన్, మాజీ ఎంపీటీసీలు చెక్కిళ్ళ నర్సమ్మ, బైరగోని సురేందర్, సీనియర్ నాయకులు కరుణాకర్, రాజ్‌కుమార్, బుర్రా రాజు, ప్రజ్ఞాపురం శ్రీధర్, బూస అంజయ్య, బాల్ సింగ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మూరి'ని గెలిపించాలి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కొమ్మూరిని గెలిపిస్తే నియోజకవర్గం అన్నివిధాల అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అయినాపూర్ సర్పంచ్ రమణారెడ్డి, కనుకరాజు, వంశీ, నవీన్, జంగని రవి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తపాస్‌పల్లి, అయినాపూర్ గ్రామాలకు చెందిన సీఐటీయూ, సీపీఎం నాయకులు సుమారు 30 మంది కొమ్మూరి రాకేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, సనాది భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లవి ఝూటా మాటలు



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: జూటా మాటలతో మోసం చేయడానికి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతల తీరును ఎండగట్టాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ మండలం కొల్గూర్, అహ్మదీపూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్, ధర్మారెడ్డిపల్లి, రంగంపేట, ముక్తమాసాన్‌పల్లి, కోమటిబండ, రిమ్మనగూడ తదితర గ్రామాల్లో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌ల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే భూములను గుంజుకుంటారని ఆ రెండు పార్టీల నేతలు విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములను పట్టాగా మార్చడానికి సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరించడానికి కార్యాచరణ సిద్ధమైందన్నారు. కార్యక్రమాల్లో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, అమరావతి, మల్లేశం, బెండె మధు పాల్గొన్నారు. కాగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్లు, మర్పడగ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.



రోడ్ షోకు హాజరైన జనం

కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో చేసిన అభివృద్ధితో కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ సాధిస్తారని ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జీడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకులు మోర భాస్కర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రేఖ మల్లేష్, మహిపాల్‌రెడ్డి, సాయికుమార్, కుంటరాజు తదితరులున్నారు.

కేసీఆర్‌కే మా మద్దతు..



దేవేందర్‌రెడ్డికి తీర్మాన ప్రతిని అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్‌కే మా ఓటంటూ కొండపాక ముదిరాజ్ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శనివారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్, బీజేపీలు మోసం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరుకు ఆకర్శితులై బీఆర్‌ఎస్‌లో చేరామని సంఘం అధ్యక్షుడు చంద్రం పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురీరెడ్డి, మాజీ ఎంపీపీ కనకయ్య, నాయకులు రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్, యాదగిరి, అంజద్, తదితరులు పాల్గొన్నారు.



బీడీలు చుడుతాం.. హామీలు నెరవేర్చుతాం

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయపల్లిలో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ ఇంటి వద్ద బీడీలు చుట్టి.. కమలం గుర్తుకు ఓటేస్తే కష్టాలు తీరుతాయని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, బాలేష్ గౌడ్, రవి పాల్గొన్నారు.



అవ్వా.. కారు 'గుర్తు'పెట్టుకో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్ ఓ ఇంటి సమీపంలో కూర్చున్న అవ్వ దగ్గరికి వెళ్లి ఈవీయంపై ఉన్న కారు గుర్తు చూపించి ఓటేయాలని కోరారు.



నీ కష్టంలో పాలుపంచుకుంటా..

మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత సిద్దిపేట పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. ఈ సందర్భంగా ఓ ఇంటి వద్ద బీడీలు చుడుతున్న మహిళను ఆప్యాయంగా పలకరించారు. శ్రీనిత కూడా ఓ బీడీ చుట్టి అందరినీ ఆకట్టుకున్నారు.

–సిద్దిపేటజోన్



ఇదిగో కారు.. వేసెయ్ ఓటు

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని శనివారం వర్గల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొమ్మ కారును చూపిస్తూ ఓటేయాలని అభ్యర్థించారు.

ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



ప్రచారంలో కొత్త మంజులతారెడ్డి, తదితరులు

కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులతారెడ్డి

దుబ్బాకటౌన్: ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొత్త మంజులతారెడ్డి కోరారు. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి తనయుడు సోలిపేట సతీశ్ రెడ్డితో కలిసి భూంపల్లి– అక్బర్‌పేట మండలంలోని పోతారెడ్డిపేట, చిట్టాపూర్, తాళ్లపల్లి, నగరం, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న మంచి మనిషి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. మాయమాటలు చెప్పి ఉపఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ నష్టపోతామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించి తెలంగాణ పౌరుషాన్ని చాటాలని పిలుపునిచ్చారు.



దుబ్బాకలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

సభకు భారీగా తరలిరండి..

దుబ్బాకలో నేడు జరిగే ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఇంటింటా తిరిగి మహిళలకు బొట్టిపెట్టి ఆహ్వానించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు ప్రచారం నిర్వహించారు.

దుబ్బాకను డివిజన్‌గా ఎందుకు చేయలే?

- నియోజకవర్గ ప్రజల మీద ఈగ వాలితే శంకరగిరి మాన్యాల దాక తరమిగొడతాం
- బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రజల మీద ఈగ వాలితే శంకరగిరి మాన్యాల దాక తరమిగొడతాం అని బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శనివారం పెద్దగుండవెల్లి, చీకోడ్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. అలాగే అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామాయంపేట, చేర్యాలను రెవెన్యూ డివిజన్లుగా చేసి దుబ్బాకను ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉపఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అక్బర్‌పేట–భూంపల్లి కొత్త మండలాన్ని ప్రభుత్వంతో కొట్లాడి సాధించి పెట్టానని రఘునందన్‌రావు అన్నారు. వచ్చే ఐదేళ్లలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

మరోసారి గెలిపించండి

తనపై నమ్మకంతో ఉప ఎన్నికల్లో గెలిపించడంతో మూడేళ్లలో ఏం అభివృద్ధి చేశానో ప్రజలకు తెలుసని, ఈ సారి పూర్తిస్థాయిల్లో ఆశీర్వదించి గెలిపించాలన్నారు. మళ్లీ అసెంబ్లీకి పంపిస్తే మీ కష్టసుఖాల్లో అండగా ఉండడంతో పాటుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతాడని మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శనివారం ఆయన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావును అభిమానులు గజమాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.... తెలంగాణలో ఉన్న బీసీలు, ఎస్సీలు ఏకమై బీజేపీకి అధికారం ఇస్తే.. బీసీ ముఖ్యమంత్రి అవడం ఖాయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నీలం సంజీవరెడ్డి నుంచి కిరణ్‌కుమార్ రెడ్డి వరకు ఒక్కరిని కూడా బీసీని ముఖ్యమంత్రిని చేయలేదన్నారు. బీసీ సీఎం చేయాలని ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ సైతం మద్దతు తెలుపుతున్నాడని, ఇది దళిత సోదరులు సైతం ఆలోచించాలన్నారు. 15 శాతం ఉన్న మాదిగలకు, 10 శాతం ఉన్న మాలలకు బీఆర్‌ఎస్‌లో మంత్రి పదవి లభించలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌లో సామాజిక న్యాయం లేదని, ఒక్క దళిత మంత్రి లేక పోవడమే నిదర్శనమన్నారు. సామాజిక న్యాయం ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. బీసీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి 55 శాతం ఉన్న బీసీలు ఓటుతో గుణ పాఠం చెప్పాలన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా ఉద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చలగాటం ఆడుతుందని మండిపడ్డారు. దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేయాలనే ఆలోచన మంత్రి హరీశ్‌రావుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దుబ్బాకకు పబ్బులు కావాలని అడిగిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి.. రెవెన్యూ డివిజన్ చేయాలని మాత్రం అడగలేదని విమర్శించారు. సర్కార్ కొలువులు ఇస్తానన్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి 25 మంది ఓటాబంది ఉద్యోగాలను బొంద పెట్టి.. ఒక్కరికి ఉద్యోగం ఇచ్చాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు కానీ, 24 గంటలు మద్యం దుకాణాలే వెలిశాయన్నారు. భూంపల్లి రోడ్డు వెడల్పులో భూములు పోకుండా ఢిల్లీలో కొట్లాడానన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 3100 చెల్లిస్తుందన్నారు. గ్యారంటీ లేని స్కీంలతో ముందుకు వస్తున్న కాంగ్రెస్‌ను దుబ్బాక ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీకి అవకాశం ఇవ్వక పోతే దుబ్బాక మరో 20 యేండ్ల అభివృద్ధి వెనకబాటుకు గురవుతుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోస పోవద్దన్నారు. కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ మల్లన్నగారి శాంతవ్వ, మల్లన్నగారి భిక్షపతి, కృష్ణ, సంతోష్, సాయిలు, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి



బీజేపీలో చేరుతున్న యువకులు

కార్యకర్తలే నా బలం..

చేగుంట(తూప్రాన్): బీజేపీ కార్యకర్తలే నా బలం.. బలగం అని ఆ పార్టీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. మండలంలోని చందాయిపేట గ్రామంలో ముదిరాజ్, యాదవ సంఘాలకు చెందిన యువకులు, వార్డు మెంబర్లు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు రోజులు బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, శ్రీనివాస్, రమేశ్, బుచ్చిరెడ్డి, వెంకట్, కొండల్‌రెడ్డి, నగేష్, శ్రీను, సాయిబాబా పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా సమస్యలే..

- ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- బీజేపీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలే ఉన్నాయని, ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ, సవాటి, అంగడి బజార్, గాంధీ చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఇంతమంది ఎమ్మెల్యేలు మారినా జనగామ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతుంటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని పేర్కొన్నారు. పేద ప్రజల జీవనోపాధికి పరిశ్రమలు తేవడంలో గత ఎమ్మెల్యేలు విఫలమయ్యారని మండిపడ్డారు. నిత్యావసర ధరలు, బస్‌చార్జీలు విపరీతంగా పెంచి సామాన్యులకు తలకు మించిన భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి రహిత పాలనను కోరుకునే వారందరూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో మాట్లాడుతున్న ఆరుట్ల దశమంతరెడ్డి

వైభవంగా దేవాలయ ప్రతిష్ఠోత్సవాలు

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతి మహాస్వామి, గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతులు మదనానంద సరస్వతి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్టు సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు